నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 23 ఆగస్టు 2024 | NIZAMABAD


కామారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు..
మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి, ఆగస్టు 22: ఎన్నికల్లో చెప్పినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా రుణమాఫీ చేయలేదని, ఆఫీసుల చుట్టూ తిప్పుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నదని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతు డిక్లరేషన్ పేరిట రూ.2లక్షలు అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా సంపూర్ణంగా మాఫీ చేయలేదని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రైతు ధర్నాలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రముఖ దేవాలయాల మీద ఒట్టువేసి ఓట్లు వేయించుకొని ఇచ్చిన హామీని మరిచిపోయారని అన్నారు. అబద్ధాలు చెప్పిన రేవంత్ రెడ్డి.. నోరా అది తాటిమట్టనా అని విమర్శించారు. రైతులను ఇబ్బంది పెట్టొద్దని, ఇకనైనా అందరికీ రుణమాఫీ చేయాలని లేదంటే బీఆర్ఎస్ రైతుల పక్షాన నిలబడి పోరాడుతుందని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు గోపీగౌడ్, కుంబాల రవియాదవ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అడ్డగోలు ఆంక్షలతో.. అన్నదాతలను ముంచారు..
మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

వేల్పూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ/వేల్పూర్, ఆగస్టు 22: అడ్డగోలు ఆంక్షలు, అర్థం లేని షరతులతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, కుంటిసాకులు చెబుతూ కొర్రీలు.. కోతలతో అన్నదాతలను నిండా ముంచారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని పలు మండల కేంద్రాల్లో నిర్వహించిన ధర్నాల్లో ఎమ్మెల్యే వేముల పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం మొదటిసారి గెలిచాక ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.లక్ష రుణమాఫీ చేశారన్నారు. రెండోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రుణమాఫీని సాకుగా చూపుతూ రేవంత్‌రెడ్డి తాము రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం, బ్యాంకు వెళ్లి రుణాలు తెచ్చుకోండంటూ రైతులకు మాయ మాటలు చెప్పి ఆశపెట్టాడని వివరించారు. బాల్కొండ నియోజకవర్గంలో 2016లో బీఆర్ఎస్ హయాంలో 47,090 మంది రైతులకు రూ.236 కోట్ల రుణమాఫీ చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం 51వేల మంది రైతులు రుణాలు తీసుకుంటే మూడు విడుతల్లో కేవలం 15,900 రైతులకు రూ.136 కోట్లు మాత్రమే మాఫీ చేసిందని, ఇంకా 36వేల మంది రైతులకు మాఫీ చేయలేదని ఆరోపించారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగా ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ రైతు రుణమాఫీ పెద్ద మోసం..

ఎన్నికల్లో రుణమాఫీ కోసం రూ.40వేల కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారని, కానీ ఇప్పటి వరకు రైతులకు చేరింది కేవలం రూ.7500 కోట్లు మాత్రమేనని వివరించారు. బీఆర్ఎస్ మొదటిసారి చేసిన రూ. లక్ష రుణమాఫీలోనే 35లక్షల మంది రైతులకు రూ.17వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కాంగ్రెస్ చెప్పిన రూ.రెండు లక్షల రుణమాఫీకి రూ.18వేల కోట్లు మాత్రమేనా? కాంగ్రెస్ చేసిన మోసం ఏంటో చెప్పడానికి ఈ ఒక్క మాట చాలన్నారు.

బాన్సువాడలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

రుణమాఫీ చేసేదాకా పోరాటం ఆగదు

బాన్సువాడ, ఆగస్టు 22: ప్రజలకు ఆశలు చూపి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నదని, రైతుబంధు డబ్బులనే రుణమాఫీకి వాడారని, అయినా సంపూర్ణంగా మాఫీ చేయలేదని టీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రైతులంతా బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకోవాలని, అందరికీ మాఫీ చేస్తామని చెప్పి.. ఇప్పుడేమో నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. బాన్సువాడలో నిర్వహించిన రైతుధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడారు. అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన రేవంత్ సర్కారుకు ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. రైతు రుణమాఫీకి ఏడున్నర వేలు కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, అవి కూడా రైతు బంధు డబ్బులేనని తెలిపారు. రుణమాఫీ విషయంలో సీఎం సంపూర్ణంగా చేశామని చెబితే, ఒక మంత్రి ఏడున్నర వేల కోట్లు అయ్యాయని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

రైతుల కోసం కాదు.. కొడుకుల కోసమే పోచారం పార్టీ మారారు..

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి లక్ష్మీపుత్రుడిగా బిరుదునిచ్చి నియోజకవర్గ అభివృద్ధికి అడిగినన్ని నిధులు మంజూరు చేసిన విషయం మరిచిపోయారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన పోచారం.. కేవలం కొడుకుల కోసమే రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరారని మండిపడ్డారు. మీకిచ్చిన వ్యవసాయ శాఖ సలహాదారు పదవితో 25లక్షల మందికి రుణమాఫీ చేయించే సలహా ఇవ్వగలవా? అని ప్రశ్నించారు. స్థానికంగానే బలమైన నాయకుడు తయారుకావాలని పిలుపునిస్తూ బీఆర్ఎస్ పార్టీలో ఉన్న జుబేర్‌ను అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, బీఆర్ఎస్ నాయకులు మోచి గణేశ్, మాజీ సర్పంచ్ విఠల్, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేయకుండా కాలయాపన..


ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ శాసనసభ్యుడు జాజాల సురేందర్

ఎల్లారెడ్డి, ఆగస్టు 22: ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించి ప్రస్తుతం కొందరికే మాఫీ చేస్తూ రేవంత్ సర్కారు మోసం చేసిందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రంలో నిర్వహించిన రైతుధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఏ గ్రామంలోనూ రుణమాఫీ సక్రమంగా కాలేదన్నారు. రుణమాఫీ చేయకుండా ప్రజలను పక్కదోవ పట్టించేందుకు హైదరాబాద్‌లో హైడ్రా పేరిట అక్రమ నిర్మాణాలు ఉన్నాయంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు పంట పెట్టుబడి సాయం అందించడంలో విఫలమయ్యారన్నారు. చేసిన మోసాలను కప్పి పుచ్చుకోవడానికి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్.. రైతుల పార్టీ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతుల పక్షాన నిలబడి రుణమాఫీ పూర్తయ్యే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

రుణమాఫీ కోసం.. రణం
ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నాలు

- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులు
- పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు
- సంపూర్ణ రుణమాఫీ చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామంటూ హెచ్చరిక

రైతులందరికీ రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన రైతుధర్నాకు విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులతో కలిసి బీఆర్ఎస్ శ్రేణులు కదం తొక్కాయి. మాజీమంత్రి, ఎమ్మెల్యే వేములతోపాటు మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గంపగోవర్ధన్, జాజాల సురేందర్, హన్మంత్‌షిండే, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా తదితరులు రైతుధర్నాలో పాల్గొని మాట్లాడారు. బోధన్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నాకు పోలీసులు అనుమతించకపోవడంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, రైతులు ధర్నా చేశారు.

మాఫీ చేయకుంటే మరో ఉద్యమం
నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల

ఖిలీల్‌వాడి, ఆగస్టు 22: రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, లేకపోతే మరో ఉద్యమం తప్పదని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో గురువారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాటలతో మాయచేసి అన్నదాతల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు మంత్రులు చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం రుణమాఫీ మీద చేస్తానని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చాడన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం రైతుల మనోభావాలను దెబ్బతీసేలా ఆలయాలపై ఒట్లు వేశారని, గెలిచిన తర్వాత షరతులంటూ ఆడుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్ రావు, నాయకులు సిర్ప రాజు, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, రవిచందర్, ప్రభాకర్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో రైతుధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిగాల

సిద్ధులగుట్ట సాక్షిగా.. హామీని అమలుచేయాలి
బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 22 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్మూర్ సిద్ధుల గుట్ట సాక్షిగా రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జీవన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలో ఆరు గ్యారెంటీలు ఆకాశాన్నంటాయన్నారు. అసత్యపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు.. రైతులకు రుణమాఫీ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నదని విమర్శించారు. ఆర్మూర్ అంటే రైతు ఉద్యమాలగడ్డ అని, గతంలో పసుపు బోర్డు సాధన కోసం, ఎర్రజొన్నల మద్దతు ధర కోసం ఉద్యమించిన చరిత్ర ఆర్మూర్ గడ్డకు ఉన్నదని గుర్తుచేశారు. జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల ఒత్తిళ్లు ఎక్కువైయ్యాయని, ప్రతి అంశాన్ని బుక్‌లో రాస్తుమన్నామని హెచ్చరించారు. ఈ నెల 24న రైతులంతా చేపట్టబోయే మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. రైతులకు రుణమాఫీ అయ్యే వరకు నిద్రపోయేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, కౌన్సిలర్ గంగామోహన్ చక్రు, పోల సుధాకర్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గెలిచాక మాట మార్చారు
మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్

మాట్లాడుతున్న ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్

డిచ్‌పల్లి, ఆగస్టు 22: అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ నిచ్చి గెలిచాక కాంగ్రెస్ పార్టీ మాట మార్చిందని ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్ విమర్శించారు. డిచ్‌పల్లిలో నిర్వహించిన ధర్నా లో పాల్గొన్న ఆయన.. సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం కలుగాలని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాంబార్ మోహన్, రమేశ్ నాయక్, దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, నల్లవెల్లి సాయిలు, నీరడి పద్మారావు, హన్మంత రావు, తనూజ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందిపేట మండల కేంద్రంలో నిర్వహించిన రైతు ధర్నాలో పాల్గొన్న నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

రైతులను మోసం చేసిన కాంగ్రెస్..
మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

మద్నూర్/బిచ్కుంద, ఆగస్టు 22: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. బిచ్కుంద, మద్నూర్‌లో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఇచ్చిన హామీల ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. ఆందోళనలు చేస్తున్న రైతులపై కేసులు నమోదు చేయడం దారుణమని, వెంటనే రైతులను క్షమాపణలు కోరాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వంలో ఇప్పటివరకు అభివృద్ధి పనులకు సంబంధించి కొత్తగా ఒక్క జీవో కూడా రాలేదని తెలిపారు. తాను మంజూరు చేయించిన అభివృద్ధి పనులను సైతం నిలిపివేస్తున్నారని అన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు నియోకవర్గ అభివృద్ధి చేయడానికి వచ్చాడో, కార్యకర్తల అంతు చూసేందుకు వచ్చాడో తెలియడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బన్సీపటేల్, హన్మాండ్లు, విజయ్‌కుమార్, గఫార్, గోవింద్, సంజయ్, నాగేశ్, మారుతి, దేవీదాస్, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

మిమ్మల్ని ఏమ 'నాలా'?
ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

ఖిల్లా రోడ్‌లో ప్రమాదకరంగా ఉన్న నాలా

మరణించిన చిన్నారి ఇంటి వద్ద నాలా పరిస్థితి..

కంఠేశ్వర్, ఆగస్టు 22: నిజామాబాద్ నగరంలో మురికి నాలాలు మృత్యుద్వారాలుగా మారాయి. చిన్నపాటి వర్షం కురిసినా చాలు నాలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మురికి, చెత్తకుప్పలతో నిండిపోయి అది సాధారణ మార్గమా? నాలానా? అనే విషయం తెలియకుండా పోతున్నది. ఏదైనా ప్రమాదం జరిగితే తప్పా అధికారులకు జాగ్రత్తలు గుర్తుకు రావంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. నగరంలోని అర్సపల్లి, మాలపల్లి, ఖిల్లా, బోధన్ బస్టాండ్, ఖలీల్‌వాడి, దుబ్బ, వర్ని రోడ్, సాయినగర్ తదితర ప్రాంతాలన్నీ వర్షం కురిస్తే చాలు డ్రైనేజీలన్నీ నిండిపోయి నీరంతా రోడ్లపై ప్రవహిస్తుంది. మూడు రోజుల క్రితం నాలాలో ప్రవహించాల్సిన వర్షపు నీరు రోడ్డుపై చేరడంతో ఆర్టీసీ బస్సు ప్రమాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రెండు రోజుల క్రితం నాలాలో కొట్టుకుపోయిన చిన్నారి ప్రాణం విడిచింది. ఓపెన్ నాలాలను గుర్తించి వాటిపై కప్పులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఓపెన్ నాలాల విషయంలో వివరణ కోరేందుకు మున్సిపల్ కమిషనర్‌ను ఫోన్ చేయగా స్పందించకపోవడం గమనార్హం.

ఆశలు 'గల్లంతు'
చిన్నారి మృతదేహం లభ్యం
గుండెలు బాదుకున్న తల్లిదండ్రులు

చిన్నారి మృతదేహాన్ని తీసుకొస్తున్న కార్మికులు

వినాయక్‌నగర్, ఆగస్టు 22: నగరంలోని ఆనంద్‌నగర్ పరిధిలో నాలాలో పడి గల్లంతైన చిన్నారి అను(2) గురువారం విగతజీవిగా లభ్యమైంది. ఇంటి ఎదుట ఆడుకుంటూ వెళ్లి బుధవారం డ్రైనేజీలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. గురువారం ఉదయం మున్సిపల్ కార్మికులు ఆనంద్‌నగర్ కాలనీ నుంచి ప్రవహించే డ్రైనేజీలో న్యాల్‌కల్ రోడ్‌లోని పీఎఫ్ కార్యాలయం వరకు గాలించారు. మురికి నీటి చెత్తలో అను మృతదేహం లభించింది. తమ బిడ్డ ప్రాణాలతో దక్కుతుందనుకుంటే శవమై కనిపించిందంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు.. స్థానికులను సైతం కంటతడి పెట్టించింది. చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించి ఐదో టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

ఇద్దరు సబ్ కలెక్టర్ల నియామకం
బోధనకు వికాస్ మహతో.. బాన్సువాడకు కిరణ్మయి

శక్కర్‌నగర్, ఆగస్టు 22: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ఇద్దరు సబ్ కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లా బోధన్ సబ్ కలెక్టర్‌గా వికాస్ మహతో నియామకం అయ్యారు. 2022లో ఐఏఎస్ పూర్తిచేసిన ఆయన అసిస్టెంట్ సెక్రటరీ, ట్రైబల్ ఎఫైర్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియాలో విధులు నిర్వర్తించారు. బోధన్ డివిజన్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కావాలని ఇటీవల పలువురు చేసిన నివేదనలు, వినతులు పరిశీలించిన ప్రభుత్వం వికాస్ మహతోను నియమించింది. బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా కిరణ్మయి కొప్పిశెట్టిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.